www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 1 ఫిబ్రవరి 2023
5
ఏలూరు



నేడు తపాలా జీవిత బీమా 140వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

భారత తపాలా శాఖ ఆధ్వర్యాన తపాలా జీవిత బీమా 140వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి ఒకటో తేదీ బుధవారం నాడు ఏలూరు పోస్టల్ డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఏలూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ మహ్మద్ ఆసిఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే లభించే తపాలా జీవిత బీమా (పిఎల్ఐ) ఇప్పుడు అన్ని రకాల డిగ్రీ లేదా డిప్లమో పట్టభద్రులకూ ఇస్తున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పిఎల్ఐ) కూడా ఉందని, ఇతర ఇన్సూరెన్స్ సంస్థలతో పోల్చితే తపాలా జీవిత బీమా తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్‌తో లభిస్తుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు సమీప పోస్టాఫీసుల్లో సంప్రదించాలని కోరారు.



కోడలమ్మ పద్దు పలికేనా..!

కర్షకుల కన్నీటి వ్యథలు.. వేతన జీవులకు ఆదాయపు పన్ను కష్టాలు.. నిధుల్లేక పోలవరం నిర్వాసితుల పరిహారపు వెతలతోపాటు జిల్లాలోని కేంద్ర విద్యాసంస్థ నిట్‌కు, కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్లకు నిధుల కేటాయింపునకు సంబంధించి నేడు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో మోక్షం కలిగేనా అనే టెన్షన్ అందరినీ వెంటాడుతోంది. మోడీ సర్కార్ ఎనిమిదేళ్లుగా జిల్లాలోని కేంద్ర ప్రాజెక్టులను పట్టించుకోకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారయ్యాయి.

నేడు పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్
'పోలవరం'కు నిధులిస్తేనే నిర్వాసితులకు మేలు
రైల్వేలైన్లకు నిధుల కేటాయింపులు సంగతేమిటో
కష్టాల కడలిలో ఆక్వా, వ్యవసాయ సాగు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల గోడు కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదు. కేంద్రం ఆధ్వర్యంలో నడిచే పోలవరం ప్రాజెక్టు జిల్లాలోనే నిర్మితమవుతోంది. దీనికి పూర్తిస్థాయిలో నిధులు కేంద్రమే ఇస్తుందని రాష్ట్రవిభజన చట్టంలో సైతం పొందుపర్చారు. కేంద్రం మాత్రం పోలవరం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతోంది. దీంతో నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా జిల్లాలో పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని దాదాపు 126 గ్రామాలను ఖాళీ చేయించాల్సి ఉంది. దీంతో 25,600కుపైగా కుటుంబాలను తరలించాలి. నిర్వాసితులందరికీ ఇళ్లు, భూమికిభూమి, యువతకు పరిహారం, పునరావాస ప్యాకేజీ వంటివి ఇవ్వాల్సి ఉంది. దీంతో పోలవరం నిర్మాణానికి మొత్తం రూ.52 వేల కోట్లు వరకూ ఖర్చు కానున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించింది. ఇప్పటికీ ప్రతిపాదనలకు ఆమోదం తెలపలేదు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చులో ఇంకా రూ.2,400 కోట్లు కేంద్రం నుంచి రాని పరిస్థితి ఏర్పడింది. గడిచిన వర్షాకాలంలో విరుచుకుపడిన గోదావరి వరదలకు ముంపు గ్రామాలన్నీ జలమయమయ్యాయి. నెలలు తరబడి పునరావాస శిబిరాల్లో నిర్వాసితులు తలదాచుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. 45.75 కాంటూరు పరిధి వరకూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలంటే కేంద్రం నిధులిస్తేనే సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసింది. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వాలంటే రూ.30 వేల కోట్లు వరకూ ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో పోలవరానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తేనే నిర్వాసితులకు న్యాయం జరుగుతుంది. అంతేకాకుండా వరదల కారణంగా డయాఫ్రం వాల్ కోతకు గురై దెబ్బతింది. దీంతో ప్రాజెక్టు పనులు సైతం పడకేశాయి. కేంద్రం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి నిర్వాసితులకు న్యాయం చేయడంతోపాటు ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉంది. డయాఫ్రంవాల్ దెబ్బతినడాన్ని బూచిగా చూపి నిధుల కేటాయింపు నుంచి కేంద్రం తప్పించుకునే అవకాశం ఉందనే వాదనతో సర్వత్రా టెన్షన్ నెలకొంది.

'నిట్'కు నిధులిచ్చేనా..?

రాష్ట్ర విభజన తర్వాత కేంద్ర విద్యాసంస్థ నిట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)ను తాడేపల్లిగూడెంలో నిర్మించారు. నిట్‌కు సంబంధించి ఇప్పటి వరకూ ఫేజ్-1 పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఫేజ్-2 పనులకు సంబంధించిన పనులకు రూ.738 కోట్లు వరకూ ఖర్చు కానున్నట్లు నిట్ యాజమాన్యం ప్రతిపాదనలు తయారుచేసి కేంద్రానికి పంపించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.230 కోట్లు వరకూ పనులు చేయాల్సి ఉంది. బడ్జెట్‌లో నిధులిస్తేనే నిట్ విద్యాసంస్థ అభివృద్ధి ముందుకు సాగుతుంది. విద్యార్థులకు అవసరైన సౌకర్యాలు ఏర్పడతాయి. ఈసారి బడ్జెట్‌లో నిట్‌కు నిధులు కేటాయిస్తారా లేదో చూడాలి. జిల్లాలోని ఉద్యాన యూనివర్సిటీ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధుల కేటాయింపు సరిగా జరగడం లేదు. ఈసారి బడ్జెట్‌లోనైనా నిధులు విడుదల కేటాయించాల్సి ఉంది.

రైల్వేలైన్లకు మోక్షం కలిగేనా

జిల్లాలో దశాబ్దాల నాటి కలగా కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్లు ఉన్నాయి. కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్‌ను కొవ్వూరు-సత్తుపల్లి రైల్వేలైన్‌గా మార్చనున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్‌లో దీనికి సంబంధించి ప్రస్తావన ఉంటుందో లేదో వేచిచూడాలి. కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు సంబంధించి సైతం నిధుల కేటాయింపు జరిగితేనే దీనికి మోక్షం లభిస్తుంది.

ఆక్వా, వ్యవసాయ రంగాలకు అండగా నిలిచేనా

జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు సాగుతోంది. ప్రతియేటా రూ.15 వేల కోట్లకుపైగా ఆదాయం వస్తోంది. విదేశీ మారకద్రవ్యం పెద్దఎత్తున తెచ్చిపడుతున్న వాటిలో ఆక్వా సాగు ఒకటి. అలాంటి ఆక్వారంగానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఏమాత్రం మద్దతు లేకుండాపోయింది. మేత ధరలు విపరీతంగా పెంచేసింది. ధర



విషయంలో నిలకడ లేకపోవడంతో వంద కౌంట్ సైతం రూ.200లోపే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆక్వా పరిశ్రమకు చేయూత

ఆదాయపు పన్ను శ్లాబ్ పెంపుపై వేతన జీవులు ఎదురుచూపు

ఏడాదికి రూ.2.50 లక్షల వరకూ ఉన్న ఆదాయపు పన్ను పరిమితిని రూ.ఐదు లక్షలకు పెంచాలని వేతన జీవులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. బడా పెట్టుబడిదారులకు పన్ను రాయితీలు కల్పిస్తున్న మోడీ సర్కార్ వేతన జీవుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. ఈసారి బడ్జెట్‌లోనైనా ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలని వేతన జీవులు కోరుతున్నారు.

విచ్చేవిధంగా బడ్జెట్‌లో నిర్ణయాలు జరగాలని ఆక్వా రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 80 శాతం ప్రజానీకం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. గడిచిన ఏడాదిలో ఎరువుల ధరల 50 కిలోల బస్తా ఏకంగా రూ.1700కుపైగా చేరిపోయింది. పురుగుమందుల ధరల పరిస్థితి అదేవిధంగా ఉంది. దీంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. మద్దతు ధర లేకుండాపోతుంది. ఎరువులకు సబ్సిడీ పెంచితే రైతులకు మేలు జరుగుతుంది. పామాయిల్ ధర పతనంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచేలా, మద్దతు ధర కల్పించేలా బడ్జెట్‌లో చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మన జిల్లా కోడలు నిర్మలా సీతారామన్ జిల్లాలో అంశాలను పట్టించుకుంటారో.. లేదో మరికొద్ది గంటల్లో తెలియనుంది.



యాత్రలో మాట్లాడుతున్న ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్

పోరాటాలతో ప్రత్యేక హోదా సాధ్యం

ప్రజాశక్తి - ఏలూరు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం అఖిలపక్షం నిర్వహించి, కేంద్రంపై పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా సాధన సమితి చేపట్టిన సమర (బస్సు) యాత్ర మంగళవారం ఏలూరు వచ్చిన సందర్భంగా కలెక్టరేట్ వద్ద నిర్వహించిన సభకు డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి కె.నాని అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి మోసగించిందన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో విద్యార్థులు, యువత హోదా సాధన కోసం నడుం బిగించాలన్నారు. రాష్ట్రంలో వామపక్ష పార్టీలు మినహా మిగిలిన ఏఒక్క పార్టీ కూడా ప్రత్యేక హోదా గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చకుండా మోసగించిందన్నారు. నాడు రాష్ట్రానికి చెందిన బిజెపి నాయకుడు వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతి కాగానే ప్రత్యేక హోదా విషయం పక్కన పెట్టారన్నారు. బిజెపి మోసగిస్తే రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం మౌనం వహించడం దారుణమన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం తీరు అలానే ఉందన్నారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం, ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు నిధులు తదితర హామీలు కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలోని యువత హోదా సాధన కోసం ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలపై ఒత్తిడి చేయాలన్నారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఈ యాత్రకు పిడిఎఫ్ ఎంఎల్‌సిలుగా పూర్తి సంఘీభావం తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం బిజెపికి భయపడుతుందని, అందుకే హోదా కోసం గట్టిగా పోరాడటం లేదని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తూ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ నిత్యావసర ధరల రూపంలో ప్రజలపై పెనుభారాలు మోపుతోందన్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ మతవిద్వేషాలను రెచ్చగొడుతూ, రాజ్యాంగానికి తూట్లు పొడిస్తుందని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు హోదా తీసుకొస్తామని చెప్పిన వైసిపి నేడు ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు భూషణం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పళ్లెం కిషోర్, డిఎన్‌విడి ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, రాష్ట్ర నాయకులు బండి వెంకటేశ్వరరావు, యు.హేమశంకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్, జిల్లా ముఖ్య నాయకులు పవన్, సాయి, రంజిత్ మహేష్, వంశీ, ఆనంద్ పాల్గొన్నారు.

గాయం త్వరగా మానుతుందని..

జంగారెడ్డిగూడెం: కాలికి ఉన్న గాయం త్వరగా తగ్గాలంటే పెట్రోల్ పోసి నిప్పంటించాలంటూ ఓ వ్యక్తి చేసిన నిర్వాకంతో ఓ బాలుడికి తీవ్రగాయమైన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాలుడి తండ్రి తగరం రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 29వ తేదీన శ్రీనివాసపురానికి చెందిన తగరం కార్తిక్ జంగారెడ్డిగూడెంలో చెకెన్ షాప్‌లో పనికి వెళ్లాడు. ఆ షాప్ యజమాని బంధువు బాలుడు కార్తిక్ కాలికి ఉన్న గాయంపై పెట్రోల్ పోస్తే త్వరగా గాయం తగ్గిపోతుందని నమ్మించాడు. అలాగే గాయంపై పెట్రోల్ పోసి అగ్గిపుల్లతో వెలిగించాడు. దీంతో కాలిపై మంటలు వ్యాపించి తీవ్రంగా కాలింది. వెంటనే స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

1098కు వీధి బాలల సమాచారం ఇవ్వండి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక కబాడీగూడెం, పాముల దెబ్బ పరిసర ప్రాంతాల్లో బడికి వెళ్లని పిల్లల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా స్థానికంగా తిరుగుతున్న బాలలు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి తప్పనిసరిగా స్కూలుకు పంపించాలని, లేనిపక్షంలో హోమ్‌కి తరలిస్తామని హెచ్చరించారు. అలాగే చైల్డ్ లైన్, సిడబ్ల్యుసి అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. అనంతరం యాదవ నగర్‌లో ఉన్న సూర్య పబ్లిక్‌స్కూల్లో బాలబాలికలకు బాలల హక్కులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలబాలికలను తప్పనిసరిగా బడికి పంపించాలన్నారు. బడికి వెళ్లని పిల్లలు తారసపడిన 1098కు ఫోన్ చేసి తెలియచేయాలని, అలాగే బాలల హక్కులపైన, ప్రాథమిక హక్కులపైన, విధులుపైన పిల్లలకు అవగాహన కల్పిగించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి సభ్యులు పుచ్చల వెంకట్, చైల్డ్ లైన్ సిబ్బంది, సూర్య పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ కొండపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతులు

కోతల్లేకుండా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వ్యవసాయ విద్యుత్‌ను సక్రమంగా అందించాలని రాచన్నగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు మంగళవారం రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తొమ్మిది గంటల విద్యుత్‌ను సక్రమంగా ఇవ్వకపోవడంతో మొక్కజొన్న, వేరుశనగ, పొగాకు తదితర పంటలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులను అడిగితే లో ఓల్టేజీ సమస్య వస్తుందని, దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సున్నం వరలక్ష్మి, వనమా వెంకటేశ్వరావు, రమేష్, వీరంకి వెంకట్, నాగేశ్వరావు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఉత్తమ సేవా అవార్డు పొందిన తహశీల్దార్ జెవి.సుబ్బారావు, ఆర్ఐ దానిని రేషన్ డీలర్లు, రెవెన్యూ ఉద్యోగులు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ద్వారా ఉత్తమ సేవా అవార్డులు, ప్రశంసాపత్రం పొందడం అభినందనీయమని రెవెన్యూ సిబ్బంది కొనియాడారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌కు, ఆర్ఐకి బొకేలు అందజేసి శాలువాలతో సన్మానించారు. అనంతరం అవార్డు గ్రహీతలు మాట్లాడారు. అందరి సహకారంతోనే అవార్డులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల అసోసియేషన్ సభ్యులు బచ్చు సూర్యనారాయణ, రామకృష్ణ, నాగేశ్వరరావు, పుల్లయ్యతోపాటు విఆర్ఒలు గోపి, ఫణి, సుబ్బారావు, హరిబాబు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్ఎ వెంకటరమణ కారును ఢీకొట్టిన వాహనం గుర్తింపు

ప్రజాశక్తి - కైకలూరు

మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ కారును ఢీకొట్టిన నిందితుణ్ని పోలీసులు ఎట్టకేలకు గుర్తించారు. మంగళవారం సిఐ వైవిఎల్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం జయమంగళ ఉపేంద్ర మాజీ ఎమ్మెల్యే కారును ఢీకొట్టినట్లు తెలిపారు. పెంచికలమర్రు గ్రామానికి చెందిన ఉపేంద్ర మండవల్లి మండలం నుచ్చుమిల్లి నుంచి చేప పిల్లల లోడుతో ఆకివీడు వెళు తుండగా సోమేశ్వరం శివారు ఉప్పుటేరు వద్ద జయమంగళ కారును ఢీ కొట్టాడు. బొలెరో వ్యాన్ వెనుక భాగం మాత్రమే కొద్దిగా తగిలిందని, దీంతో చిన్న ప్రమాదమే కదా అని వెళ్లిపోయినట్లు ఉపేంద్ర తెలిపాడు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుణ్ని గుర్తించామన్నారు. కైకలూరు రూరల్ ఎస్ఐ కృష్ణ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రమాద సంఘటపై టిడిపి నాయకులు ఆరోపించిన విధంగా ఎలాంటి రాజకీయ కోణమూ లేదన్నారు.

సంకల్ప దీక్షను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు



సంకల్ప దీక్ష పోసర్లను ఆవిష్కరిస్తున్న సాబ్జీ, నేతలు

పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం ధర్మస్థలిలో జరిగే సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పిలుపునిచ్చారు. పాత పెన్షన్ పునరుద్ధరణకు విజయవాడ-ఏలూరు హైవేలో గన్నవరం దగ్గర ధర్మస్థలిలో జరిగే సంకల్ప దీక్ష పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవిత భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం రూపొందిస్తామని ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ వెంటనే నెరవేర్చాలన్నారు. గ్యారేంటెడ్ పెన్షన్ విధానం (జిపిఎస్) అమలు చేస్తామని ప్రతిపాదించడం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని సాబ్జీ డిమాండ్ చేశారు. సిపిఎస్‌కు ప్రతిరూపమే జిపిఎస్ అని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. రెగ్యులర్ ఉద్యోగాలు కల్పన తగ్గిపోతున్న కొలది పాత పెన్షన్ విధానం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా భారం పడదన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ రాష్ట్రం మొదటి నుండి పాత పెన్షన్ విధానమే కొనసాగిస్తుండగా రాజస్తాన్, ఛత్తీసగడ్, జార్కండ్, పంజాబ్ రాష్ట్రాలు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాయని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు మాట్లాడుతూ ఇటీవల ఏర్పడిన హిమాచల్‌ప్రదేశ్ నూతన ప్రభుత్వం కూడా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. తమిళనాడు రాష్ట్రం కూడా ఏప్రిల్ నుండి పాత పెన్షన్ విధానానికి వస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరావు, కోశాధికారి షేక్ ముస్తఫాలీ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇ.శివశంకర్, ఎమ్‌డి.జక్రియా పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే జగన్ ధ్యేయం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అన్ని సామాజిక తరగతి ప్రజల అభివృద్ధే ధ్యేయంగా సిఎం జగన్ ప్రభుత్వం పనిచేస్తుందని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్‌అప్పారావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వడ్లమాను గ్రామంలో జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఆయన అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకొన్నారు. ప్రజలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, ఎంపిపి జి.అనూష, ఎంపిటిసి సభ్యులు ఆర్.సత్యనారాయణ, వైసిపి నాయకులు పి.నరసింహారావు, జి.ఇస్సాక్, ఇవి.సుబ్బయ్య, భాస్కరప్రసాద్, నాగరాజు, రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంఎల్ఎ ప్రతాప్

జగనన్న కాలనీ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలు

యూనిట్లు స్థాపనకు కామన్ సైట్లు గుర్తించండి - అధికారులకు జెసి ఆదేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో పెద్దఎత్తున ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న లే అవుట్ ప్రాంతాల్లో ఉపాధి కల్పించే కుటీర పరిశ్రమ యూనిట్లు నెలకొల్పేందుకు కామన్ సైట్లను గుర్తించాలని సంబంధిత అధికారులకు జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచించారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనీ గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం జెసి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న లే అవుట్ ప్రాంతాల్లో గార్మెంట్, కుట్టు, జ్యూట్ బ్యాగ్స్, ఆటోమొబైల్ తదితర ఉపాధి కల్పించే చిన్న తరహా యూనిట్లు నెలకొల్పేందుకు సంబంధిత తహశీల్దార్లను సంప్రదించి కామన్ సైట్లను గుర్తించాలన్నారు. దీని ద్వారా అక్కడ నివాసిత కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు వీలుంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ అధికారులను జెసి ఆదేశించారు. అదే విధంగా ప్రస్తుతం జిల్లాలో 70వేల ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని ఇందుకు 10.50 కోట్ల ఇటుకలు ఇళ్ల నిర్మాణానికి అవసరం కాగాలవన్నారు. ఈ దృష్ట్యా పిఎంఇజిపి ద్వారా మరిన్ని ఫ్లైయాష్ బ్రిక్ యూనిట్లు నెలకొల్పేందుకు చర్యలను వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న 130 యూనిట్లకు అదనంగా మరిన్ని యూనిట్లు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేసేందుకు సంబంధిత లబ్ధిదారుల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెదపాడు మండలం వట్లూరు, భోగాపురంలో 350 ఎకరాల భూమికి సంబంధించిన విషయంలో వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఎపిఐఐసి జోనల్ మేనేజర్‌ను జెసి ఆదేశించారు. ఇందుకు సంబంధించిన సమగ్ర రికార్డులతో శనివారంలోపు మంగళగిరిలోని ఎపిఐఐసి ప్రధాన కార్యాలయానికి వెళ్లి సంబంధిత ఉన్నతాధికారులను సంప్రదించి అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి గ్రామంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు సంబంధించిన భూమి విషయంపై సమగ్ర నివేదికను కమిటీకి సమర్పించాలని ఎపిఐఐసి జోనల్ మేనేజర్‌ను జెసి ఆదేశించారు.

స్టాండప్ ఇండియా కింద ఇంత వరకు 157 మంది లబ్ధిదారులు రూ.22.09 కోట్ల ఆర్థిక సహాయాన్ని పొందారన్నారు. సెక్యూరిటీ లేని రుణాలను లబ్ధిదారులకు అందించేందుకు బ్యాంకర్లు సిద్ధంగా ఉన్నారని ఎల్‌డిఎం వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పథకం కింద ఎస్‌సి, ఎస్‌టి, మహిళలకు తొలిప్రాధాన్యతిచ్చి ప్రతి బ్రాంచిద్వారా యూనిట్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని జెసి సూచించారు. జిల్లాలో ఎంఎస్ఎంఇ కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.రెండు వేల కోట్లతో సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల యూనిట్లను నెలకొల్పాలని లక్ష్యంగా నిర్ధేశించామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మూడో క్వార్టర్ ముగిసేనాటికి 21 వేల 636 మంది లబ్ధిదారులకు రూ.930.94 కోట్లు బ్యాంకుల ద్వారా అందించామని, త్వరితగతిన మిగిలిన లక్ష్యాన్ని ఖచ్చితంగా సాధించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం కింద 29 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించి 29 మంది ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి లబ్ధిదారులకు పెట్టుబడి రాయితీ, వడ్డీ రాయితీ, విద్యుత్ టారీఫ్ రాయితీ, వాణిజ్య పన్నుల రాయితీ కింద రూ.2.01 కోట్లు మంజూరుకు సమావేశం ఆమోదం తెలిపింది. పిఎంఇజిపి పథకంలో స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకునేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎపి కెవిఐబి, కెవిఐసి మూడు ఏజెన్సీలు మరిన్ని దరఖాస్తులు స్పాన్సర్ చేయాలని అదే విధంగా సవరించిన లక్ష్యాలను సాధించాలని సంబంధిత శాఖల అధికారులను జెసి పి.అరుణ్ బాబు ఆదేశించారు. ఈ పథకంలో బ్యాంకు శాఖల్లో పెండింగులో ఉన్న దరఖాస్తులు వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలని లీడ్ బ్యాంక్ మేనేజరును ఆదేశించారు. వివిధ పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ డెస్క్‌కు వచ్చిన 215 దరఖాస్తుల్లో నిర్ణీత కాల పరిమితిలో 204 పరిష్కరించగా, పరిశీలనలో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వివిధ కారణాలతో మరో ఐదు దరఖాస్తులు తిరస్కరించడ్డయన్నారు. జిల్లాలో ఎంటర్ పెన్యూర్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం (ఇడిపి) ప్రోత్సాహంలో భాగంగా ఇంతవరకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన కోసం తొమ్మిది ఇడిపి సమావేశాలు నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి.ఏసుదాసు, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ కృష్ణప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ సుమధురవాణి, జిల్లా పంచాయతీ అధికారి మల్లిఖార్జున, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ వెంకటేశ్వరరావు, జాయింట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ టాక్స్ పి.జగదీశ్వరరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎ.శ్రీనివాస్, పశు సంవర్ధక శాఖ జెడి డాక్టర్ జి.నెహ్రూబాబు, ఉద్యానశాఖ డీడీ పాండురంగ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!

అధ్వానంగా ముసునూరు మండలంలోని ప్రధాన రహదారులు - ప్రయాణికులకు తప్పని అవస్థలు - పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు నుంచి గోపవరం మీదుగా ఏలూరు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ఏ మాత్రం ఆదమరిస్తే ప్రయాణించిన అంతేసంగతులు అనేలా ఈ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. అడుగుకో గొయ్యి ఏర్పడటంతో వాహనదారులు, పాదచారులు నానాఅవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే ప్రజలు వణికిపోతున్నారు. బిక్కుబిక్కుమంటూ రాకపోకలు చేయాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికే ఈ రోడ్డుపై ఉన్న గోతుల్లో పడి అనేకమంది తీవ్రగాయాలపాలయ్యారు. అలాగే ముసునూరు నుండి నూజివీడు వెళ్లే ప్రధాన రహదారి కొర్లగుంట గ్రామ పరిధిలో ప్రమాదకరంగా ఉంది. భారీ గోతులతో పాటు మార్జిన్లు కుడా కోతకు గురికావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆటోలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ముఖ్యంగా వలసపల్లి, చిల్లబోయినపల్లి గ్రామాల్లోని ఆర్అండ్‌బి రోడ్డు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఏలూరు జిల్లా కేంద్రం కావడంతో నూజివీడు నుంచి ముసునూరు, వేల్పుచర్ల మీదుగా రాకపోకలు అధికమయ్యాయి. ఈ ప్రధాన రహదారులన్నీ భారీగోతులతో ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే నూజివీడు నుండి ముసునూరు మండలంలోని కాట్రేనిపాడు మీదుగా చిల్లబోయినపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారులు కూడా పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. డివిజన్ కేంద్రమైన నూజివీడు నుండి జిల్లా కేంద్రం ఏలూరుకు నాన్‌స్టాప్ బస్సులు నడపాలని ప్రతిపాదనలు తీసుకువచ్చే అవకాశం కోసం ఎదురుచూస్తున్న నాయకులు ప్రధాన రోడ్లు ఇలా ఉంటే ఎలా నడుపుతారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.



గోతులమయంగా ఉన్న ఏలూరు - ముసునూరు రోడ్డు



సమన్వయకర్తల నియామక పత్రాలను పరిశీలిస్తున్న నాయకులు

గుండుగొలను సమన్వయకర్తల నియామకం పూర్తి


ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను సచివాలయ క్లస్టర్ వైసిపి సహాయ సమన్వయకర్తల నియామకం పూర్తయినట్లు ఉపసర్పంచి, వైసిపి గ్రామ అధ్యక్షులు ముదుండి సూర్యనారాయణరాజు తెలిపారు. సమన్వయకర్తలు, కో ఆర్డినేటర్లు, వాలంటీర్లు, ముఖ్యనాయకులతో గుండుగొలను వైసిపి పార్టీ కార్యాలయంలో గ్రామ అధ్యక్షులు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలో ప్రభుత్వపరంగా పనిచేస్తున్న వాలంటీర్లకు పార్టీ నియమించిన సమన్వయకర్తలు, సహాయ సమన్వయకర్తలు తమవంతు సహకారాన్ని అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో అర్హత ఉండి ప్రభుత్వ లబ్ధి అందని వారిని గుర్తించి వారి వివరాలను వాలంటీర్ల దృష్టికి తెస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు జి.మురళీ, జహీర్, ఎస్.క్రిష్ పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రాజ్యాంగం ప్రజలకు కల్పించిన పౌరహక్కుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ ఎం.ఉదయభాస్కర్‌రావు అన్నారు. మంగళవారం నూగొండపల్లి గ్రామ సచివాలయం వద్ద పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.సుహాసిని, పంచాయతీ కార్యదర్శి సిహెచ్.పుల్లారావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో..

ముసునూరు: ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవాలని వైస్‌ఎంపిపి కోటగిరి రాజానాయన పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లోపూడిలో గ్రామ సచివాలయంలో ప్రాథమిక హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, సర్పంచి పేరం కృష్ణ, తహశీల్దార్ దాసరి సుధ, ఎంపిడిఒ జి.రాణి, కూచిపూడి సాయిరాము పాల్గొన్నారు.



ముసునూరు మండలంలో..

నేరాలు - ఘోరాలు



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - నూజివీడు

మండలంలోని కొత్తూరు తండాలో ఈనెల 29వ తేదీన బాణావతి యేసు అలియాస్ హిల్లే హత్యకేసులో నిందితుణ్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు నూజివీడు డిఎస్‌పి అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. పాతకక్షలే ఈ హత్యకు కారణమని పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మూడు నెలల క్రితం కొత్తూరు తండాకు చెందిన వాలంటీర్ భూక్యా రాధిక మేనకోడలు వెన్నెల ఓణీల వేడుక జరిగింది. ఈ సందర్భంలో మృతుడు ఏసుకు, హటియాతండాకు చెందిన నిందితుడు పోరియోకు మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో పోరియో ఓ రాయిని తీసుకుని అతనిపై విసిరాడు. ఆ రాయి గురితప్పి పక్కనే ఉన్న మూడు కోటి అనే వ్యక్తి మర్మావయవానికి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో మృతుడు ఏసు కొంతమందితో కలిసి పోరియోను స్తంభానికి కట్టి కొట్టారు. దీంతో ఏసుపై పగపెంచుకున్న పోరియో అతన్ని ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఈనెల 29వ తేదీన బస్టాప్ దగ్గరలో ఉన్న సిమెంట్ బెంచ్‌పై ఏసు, మూడు కోటి మాట్లాడుకుంటుండగా ఇదే అదునుగా భావించిన పోరియో తన వెంట తెచ్చుకున్న కత్తితో ఏసును విచక్షణారహితంగా పొడిచాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే అక్కడ నుంచి పోరియో పరారయ్యాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో అన్నవరం అడ్డరోడ్డు వద్ద అతన్ని అరెస్టు చేశారు. పోలీసుల విచారణలో గతంలో జరిగిన పాత గొడవల నేపథ్యంలోనే ఏసుని కత్తితో పొడిచి హత్యచేసినట్లు అతను నేరం అంగీకరించాడని డిఎస్‌పి తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తిని సిఐ అంకబాబు స్వాధీనం చేసుకున్నారు. నిందితుణ్ని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు.

హోటళ్లలో విజిలెన్స్ తనిఖీలు

భీమడోలు: ఏలూరుకు చెందిన విజిలెన్స్ అధికారులు మంగళవారం సాయంత్రం భీమడోలు జంక్షన్‌లోని పలు హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఓ హోటల్లో గృహ అవసరాలకు ప్రత్యేకించిన వంట గ్యాస్ సిలిండర్లను నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా మూడు సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ నాగరాజు, విజిలెన్స్ వ్యవసాయాధికారి కె.శ్రీధర్, ఆర్ఐ కె.కిరణ్‌కుమారి, గ్రామ రెవెన్యూ అధికారులు వి.వినయ్‌కుమార్, గంధం మార్కండేయులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

జీలుగుమిల్లి: మండలంలోని తాటియాకులగూడెం ఎస్ఇబి అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద మంగళవారం ఎస్ఇబి సిఐ మణికంఠ రెడ్డి అధ్వర్యంలో చేపట్టిన వాహన తనిఖీల్లో భద్రాచలం నుంచి రాజమండ్రి వెళ్తున్న ఆర్‌టిసి బస్‌లో గంజాయిని గుర్తించారు. ఎస్ఇబి సిఐ మణికంఠ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం తమిళనాడుకు చెందిన నలుగురు ప్రయాణికులు చింతూరు నుంచి భద్రాచలం వచ్చి అక్కడ నుంచి రాజమండ్రికి చెందిన ఆర్‌టిసి బస్సులో వస్తున్నట్లు తెలిపారు. వారు తమిళనాడుకు చెందిన ప్రయాణికులుగా గుర్తించామన్నారు. గంజాయిని చింతూరు నుంచి చెన్నైకి తరలించనున్నట్లు తెలిపారు. సుమారు 20 నుంచి 25 కేజీల వరకూ ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. నలుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.


అవార్డు గ్రహీత ఉషారాజకుమారికి సన్మానం

ప్రజాశక్తి - భీమడోలు

జిల్లాస్థాయిలో ఉత్తమ వ్యవసాయ సహాయ సంచాలకులుగా ఎంపికైన మండల వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ పి.ఉషారాజకుమారిని మంగళవారం ఘనంగా సన్మానించారు. గతనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ద్వారా ప్రసంశాసపత్రం అందుకున్నారు. అలాగే వ్యవసాయ శాఖ జెడి పి.రామకృష్ణ ఆమెను అభినందించారు. ఈ నేపథ్యంలో భీమడోలులోని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో భీమడోలు సబ్‌డివిజన్‌తో పాటు నిడమర్రు వ్యవసాయాధికారి, సబ్ డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, కార్యాలయ సిబ్బంది మంగళవారం సాయంత్రం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ శాఖ ద్వారా చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు సరైన రీతిలో సహాయ సహకారాలు అందజేసి రైతులకు సేవలు చేసే క్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వ్యవసాయ సహాయ సంచాలకులు సహకరించే వారని పేర్కొన్నారు. అనంతరం ఉషారాజకుమారి మాట్లాడుతూ సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ లక్ష్యాల మేరకు ధాన్యాన్ని పూర్తిస్థాయిలో సేకరించామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, ఇతరాలు అందుబాటులో ఉంచడంతోపాటు అనేక సేవలను వారికి అందజేశామన్నారు. 250 ఎకరాల విస్తీర్ణంలో పొలంబడి కార్యక్రమాన్ని ప్రయోగాత్మంగా నిర్వహించేందుకు ఎంపిక చేసిన భీమడోలు వ్యవసాయ క్షేత్రాలకు సమర్థవంతంగా సేవలు అందజేశామన్నారు.

ఉత్తమ గ్రామ సహాయకులుగా ఎస్.సురేఖ

వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకుల కార్యాలయానికి మరొక ఘనత దక్కింది. ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామ వ్యవసాయ సహాయకులుగా పనిచేస్తున్న సురేఖ ఉత్తమ గ్రామ సహాయకులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ల్యాబ్ అధికారి చీర్ల రవికుమార్, ద్వారకాతిరుమల వ్యవసాయాధికారి ఎ.రమేష్, ఉంగుటూరు వ్యవసాయాధికారి బి.వెంకటేష్, భీమడోలు వ్యవసాయాధికారి ఎస్‌పిబి.ఉషారాణి, నిడమర్రు వ్యవసాయాధికారి బిన్నీబాబు, భీమడోలు వ్యవసాయ విస్తరణ అధికారి కెఎస్.వర్మ పాల్గొన్నారు.



ఉషారాజకుమారిని సత్కరిస్తున్న ఉద్యోగులు



సమావేశంలో సభ్యుల వాగ్వివాదం

వాడీవేడిగా నూజివీడు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పురపాలక సంఘ సమావేశం వాడీవేడిగా సాగింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశం అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్రవాగ్వివాదానికి దారితీసింది. ఈ సమావేశంలో టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో రాజకీయ సమావేశాలు నిర్వహించవచ్చా... లేదా అని ప్రశ్నించారు. అధికార కౌన్సిల్ సభ్యులు గిరీష్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో సైతం కొనసాగుతున్న తీరును తప్పుబట్టగలరా అని ఎదురు ప్రశ్నించడంతో ఘర్షణకు దారితీసింది. అజరయ్య పేటకు చెందిన టిడిపి కౌన్సిలర్ కొమ్మన విజయ మాట్లాడుతూ తాగునీటి సరఫరా సక్రమంగా లేదని ఆవేదన వ్యక్తం చేయడంతో, మరో మహిళాకౌన్సిలర్ మద్దతు పలికారు. సమాధానం చెప్పే క్రమంలో కో ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణకుమార్ మాట్లాడుతుండగా ఎవరికి వారే ఆవేశంగా మాట్లాడిన తీరుతో గందరగోళం ఏర్పడింది. చివరికి అధికార, ప్రతిపక్షం అనే సమస్య లేకుండా ప్రజలందరికీ సమానంగా నీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించడంతో గొడవ సర్దుమణిగింది. వైసిపి కౌన్సిలర్ నౌడు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కబేళాపై అధికారుల అజమాయిషి ఉండాలని కోరారు. ఎలాంటి జంతువులను కోస్తున్నారో తెలియడం లేదని, ఇది పూర్తిగా ప్రజారోగ్యానికి సంబంధించిన విషయం కాబట్టి పూర్తిస్థాయి పరిశీలన ఉండాలని కోరారు. అనంతరం సుమారు రెండు కోట్ల రూపాయలతో చేయాల్సిన అభివృద్ధి అంచనాలకు సంబంధించి కౌన్సిల్ ఆమోదం తెలిపింది.



మాట్లాడుతున్న సత్యనారాయణ

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని బొర్రంపాలెంలో నిర్వహించిన సెక్టార్ సమావేశంలో పాల్గొన్న సత్యనారాయణ అంగన్‌వాడీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగనవాడీలకు రూ.ఐదు లక్షల పెన్షన్ సౌకర్యం, సబ్సిడీపై గ్యాస్ ఇవ్వాలని పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని మాల మహాసేన జాతీయ అధ్యక్షులు అలగా రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాలమహాసేన జాతీయ అధ్యక్షులు అలగా రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజా ఉద్యమాలకు దిగొచ్చి పదేళ్ల సబ్‌ప్లాన్‌ను పొడిగించిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా శాశ్వతమైన ఆర్డినెన్స్ తీసుకురావాలని రవికుమార్ డిమాండ్ చేశారు. ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక ఎస్‌సి కార్పొరేషన్ నిధులు దారిమళ్లించారని మండిపడ్డారు. ప్రజాసంఘాల ఆందోళనలతో స్పందించిన ప్రభుత్వం పదేళ్లు పొడిగించి చేతులు దులుపుకుందని విమర్శించారు. సబ్‌ప్లాన్‌ను శాశ్వతంగా పటిష్టంగా అమలు చేసేందుకు జిఒ తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిధులను అమ్మఒడి, జగనన్న ఆసరా, రైతు భరోసా వంటి పథకాలకు మళ్లించకుండా ఎస్‌సి, ఎస్‌టిలకు ఖర్చుపెట్టాలని, దళితపేటల అభివృద్ధికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహాసేన రాష్ట్ర అధ్యక్షులు కాపుదాసు రవికుమార్, మాలమహాసేన నాయకులు దిలీప్ కుమార్, మాల మహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, విజయ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు

ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం 2023 క్యాలెండర్‌ను జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మంచి సమాచారంతో కేలండర్‌ను రూపొందించడం అభినందనీయమన్నారు. మరో ముఖ్యఅతిథి ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఈ క్యాలెండర్‌ను 500 విద్యాలయాలకు అందించే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ రంగాల్లో దేశానికి, ప్రపంచ మానవాళికి సేవలందించిన మహనీయుల జయంత్యుత్సవాలు, వర్థంతులు, వివిధ పరిశోధనలు, ప్రముఖఅంశాలతో ఈ క్యాలెండర్‌లో తేదీలను తెలుపుతూ ముద్రించామన్నారు. సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2022లోనూ ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం పేరుతో ఇలాంటి క్యాలెండర్‌ను ముద్రించామని, ఈ క్యాలెండర్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అనేక సంస్థలు, పెద్దల అభినందనలు పొందిందని తెలిపారు.

విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ క్యాలెండర్ రూపకల్పనలో సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం సభ్యులు విజిఎంవిఆర్.కృష్ణారావు, విపాశన మెడిటేషన్ సెంటర్ మేనేజింగ్ ట్రస్టీ జె.సత్యనారాయణరాజు, హేలాపురి బాలలోత్సవ సభ్యులు పి.కస్తూరిబాయి, కూన కృష్ణారావు, షేక్ ముస్తఫాఆలీ, జి.శారద, ఎస్.రవి, కోటిపల్లి రాజ్యలక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ పాల్గొన్నారు..

క్షతగాత్రునికి వెంకటరాజు సాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్థానిక ఫొటో గ్రాఫర్ అనీల్ కుమార్ వైద్యానికి రూ.రెండు లక్షలు సాయం అందించి మానవత్వం చాటుకున్నారు బయ్యనగూడేనికి చెందిన నాటకశాల వెంకటరాజు. మంగళవారం పట్టణంలోని అద్దె ఇంటిలో నివాసం ఉంటున్న అనిల్‌కుమార్ ఇంటికి వెళ్లి బంధువులతో రోడ్డు ప్రమాదం జరిగిన తీరు, వైద్యం అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనీల్ కుమార్ వైద్యానికి కుటుంబ సభ్యులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించి చలించిన నాటకశాల వెంకటరాజు రూ.రెండు లక్షలు బాధితుల ఖాతాకు జమచేశారు. అలాగే కుటుంబ ఖర్చుల నిమిత్తం నెలకు రూ.పదివేలు సాయం చేసేందుకు హామీ ఇచ్చారు.




సాయం చేసిన దాతలు

కల్వపూడి సత్రం నివాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ముదినేపల్లి : కల్వపూడిసంత్రం నివాసితుల సమస్య పరిష్కారానికి ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు స్పందించారు. నివాసితుల వద్దకు మంగళవారం సాయంత్రం వెళ్లి వారి వివరాలు సేకరించారు. 'న్యాయం చేయండి మహాప్రభో' అనే శీర్షికన గత నెల 30వ తేదీన ప్రజాశక్తిలో వార్తకు అధికారులు స్పందించారు. రోడ్డు విస్తరణలో తమ ఇళ్లు కోల్పోతున్నామని, ప్రభుత్వం తమ ఇళ్లకు నష్ట పరిహారం చెల్లించాలంటూ నివాసితులు నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన తహశీల్దార్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల సర్వేయర్ శీలం రామకృష్ణ, విఆర్ఓ శ్రీనివాస్ కల్వపూడి సత్రం నివాసితుల వద్దకు వెళ్లి వారి గోడు విన్నారు. 50 ఏళ్లుగా ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్న వారి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా నివాసితుల ఆధార్, రేషన్ కార్డులు, ఇతర ఆధారాలు సేకరించి వెంటనే తనకు నివేదిక పంపాలని తహశీల్దార్ విఆర్ఓను అదేశించారు. అధికారులు స్పందించడం పట్ల నివాసితులు ఆనందం వ్యక్తం చేశారు.




మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంపిపి

పోషక విలువలతో మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి - ముసునూరు

సిఎం జగన్ ప్రతిష్టాత్మకంగా పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నారని ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి సుబ్బారావు అన్నారు.మంగళవారం మండలంలోని ముసునూరు జిల్లా పరిషత్ వున్నత పాఠశాల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కన్నా ఇప్పుడు కోన్ని ప్రత్యేకమైన వంటకాలతో విద్యార్థులకు మధ్యాహ్న బోజనం అమలు చేస్తున్న రన్నారు.



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నాయకులు

పార్టీ ఆశయసాధనకు కృషి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పార్టీ ఆశయాలకు అణుగుణంగా పనిచేస్తానని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ అన్నారు. మండల కాపు నేతలు మంగళవారం మండలంలోని తిరుమలదేవిపేటలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శి పదవి రావడానికి కృషి చేసిన రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరావు, పార్టీ అధినేత చంద్రబాబు, లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు, మండల నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కాపులకు ఏ పార్టీ తరపునా రాష్ట్రస్థాయి పదవి ఇవ్వలేదని, తనపై నమ్మకంతో కార్యదర్శిగా ఎంపిక చేయడం సంతోషదాయకమన్నారు. బాధ్యతగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాల్నీడి రాంబాబు, పుప్పాల బాబు, పసుపులేటి సుబ్బారావు, సవరం సురేష్, ధనంశెట్టి నాగు, కాల్నిడి వెంకటరత్నం, పారెపల్లి వెంకటరామయ్య, వడ్డి శ్రీనివాసరావు, తోట సత్యనారాయణ, సాధనాల బూసిబాబు, కాళ్ల శ్రీను, తమ్మిశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

కంప్యూటర్ అప్లికేషన్ సబ్జెక్టు బోధనకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కళాశాలలో కంప్యూటర్స్ అప్లికేషన్ సబ్జెక్టు బోధనకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు పీజీలో 50 శాతం మార్కులు వచ్చి ఉండాలన్నారు. పిహెచ్‌డి, నెట్‌స్లెట్ కలిగిన వారికి ప్రాధాన్యతిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిలున్నవారు ఈ నెల ఆరో తేదీనాటికి కళాశాలకు ధరఖాస్తు పంపాలన్నారు. పదో తేదీన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.